ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

5
వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
బుధవారం 4 డిసెంబరు 2024



కీసరగుట్ట ఆదాయం రూ.1.32కోట్లు

కీసర, డిసెంబరు, 3(ఆంధ్రజ్యోతి): కీసరగుట్ట ఆదాయం రూ.1,32,33,779 వచ్చినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకొని మంగళవారం ఆలయ మహా మండపంలో దేవాదాయ శాఖ అధికారులు, చైర్మన్ టి. నాగలింగం ఆధ్వర్యంలో, భక్తుల సమక్షంలో నెలరోజుల పాటు వచ్చిన హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఈ సందర్భంగా అర్జిత సేవలు, సామూహిక సత్యనారాయణ వ్రతాలు టిక్కెట్లు, శీఘ్ర దర్శనాల టిక్కెట్లు, ప్రసాదాల వితరణ, హుండీ ద్వారా మొత్తం రూ.1,32,33,779 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. వచ్చిన ఆదాయాన్ని ఆలయం బ్యాంక్ ఖాతాలో జమ చేసినట్లు ఈవో సుధాకర్‌రెడ్డి, చైర్మన్ నాగలింగం తెలిపారు. కాగా గత సంవత్సరం కంటే 29 లక్షలు అధిక ఆదాయం వచ్చినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.



నీటూర్ గేటు వద్ద రోడ్డుపై కి.మీ మేర నిలిచిన పత్తి వాహనాలు

పత్తి అమ్మకాలకు పడిగాపులు

దౌల్తాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించి పండించిన పత్తి పంటను విక్రయించేందుకు రైతులు పడిగాపులు పడుతున్నారు. దౌల్తాబాద్ మండలంలో పత్తి కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో నీటూర్ గేటు దగ్గర ఉన్న విజయ పత్తి మిల్లు దగ్గర రైతులు పత్తిని విక్రయించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. కొంత మంది రైతులు గ్రామాల్లోనే దళారులకు విక్రయించి నష్టపోతున్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రంలో మద్దతు ధర లభిస్తుందని వెళితే అక్కడ నిర్వాహకులు తేమ పేరుతో తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పత్తికి మద్దతు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

వైకల్యమున్న వారిని అవమానించొద్దు




వైద్యులతో మాట్లాడుతున్న శీతల్

వికారాబాద్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మానసిక, ఇతర వైకల్యం ఉన్న వారిని చిన్నచూపు చూస్తూ అవమానించొద్దని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి, న్యాయాధికారి శీతల్ అన్నారు. మంగళవారం పట్టణంలోని భవిత సెంటర్‌లో డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో మానసిక వికలాంగుల దినోత్సవం సందర్భంగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె వారికి పరికరాలు, మందుల గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో డీహెంహెచ్‌వో వెంకటరవణ, కౌన్సిల్ టి.వెంకటేశ్, పి.రాము, ఎం.శ్రీనివాస్, ఎ.శంకరయ్య, డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలే లక్ష్యం

ప్రజాబాట పట్టిన రాజకీయ పార్టీలు

రాజకీయ పార్టీలన్నీ ప్రజల వద్దకు పరుగులు తీస్తున్నాయి. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. అధికార, ప్రతిపక్షం అనే తేడా లేకుండా నాయకులందరూ గ్రామాల్లోని ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో బిజీ అయ్యారు. కాంగ్రెస్‌తో పాటు బీజేపీ, బీఆర్ఎస్, టీడీపీలు ప్రజల్లోకి వెళ్లేందుకు ఇప్పటికే షెడ్యూల్‌ను ప్రకటించాయి. అసెంబ్లీ నియోజకవర్గం యూనిట్‌గా కార్యక్రమాలను చేపట్టేందుకు వ్యూహాలను రూపొందిస్తున్నారు. డిసెంబర్ నెలలో దాదాపు 15 రోజుల పాటు జనాన్ని కలిసేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసుకున్నారు.



ఇప్పటికే ప్రత్యేక కార్యాచరణ సిద్ధం
ప్రజాపాలన విజయోత్సవాల పేరిట కాంగ్రెస్
చార్జిషీట్లతో ప్రజల వద్దకు బీజేపీ
బీఆర్ఎస్ ఎజెండా రైతు సమస్యలు
సభ్యత్వ నమోదు, నిర్మాణంపై టీడీపీ నజర్

తాండూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): లోకల్ బాడీ ఎన్నికలను అన్ని పక్షాలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. అధికార కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే ప్రణాళికను సిద్ధం చేసుకుంది. 1వ తేదీ నుంచి 9 రోజుల పాటు ప్రజల్లో ఉండాలని, ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారెంటీలతో పాటు ఇతర పథకాలను ప్రజలకు వివరించాలని అధికార కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. రైతు, మహిళ, యువత పేరిట రోజుకో కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించి నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యేలకు బాధ్యతలను అప్పగించారు. తాండూరుకు మంజూరైన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన, స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో క్రీడా పోటీలతో యువతను ప్రోత్సహించేందుకు, పనుల జాతర పేరిట ఉపాధి పనులకు శంకుస్థాపనలు, ఏడాది పాలనపై ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతున్నారు. ఎమ్మెల్యేతో పాటు మాజీ

మిగతా 8వ పేజీలో...

సభ్యత్వం, సంస్థాగత నిర్మాణంపై..

2014 తర్వాత రాజకీయంగా ప్రజలకు దూరంగా ఉన్న తెలుగుదేశం పార్టీ మళ్లీ ప్రజల్లోకి రావాలని నిర్ణయించింది. ప్రధానంగా సభ్యత్వ నమోదు కార్యక్రమంతో పాటు సంస్థాగతంగా నిర్మాణం చేపట్టాలని నిర్ణయించింది. టీడీపీకి ప్రజల్లో ఇంకా ఆదరణ ఉందని ఆ పార్టీ నాయకులు భావిస్తున్నారు. ఇందులో భాగంగా సభ్యత్వం చేపడుతూ ప్రజల్లోకి వెళ్లనున్నారు. ఇందుకు సంబంధించి త్వరలో కార్యచరణను ప్రకటించే అవకాశముందని టీడీపీ నేత ఒకరు తెలిపారు.

ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కాలుష్యాన్ని తగ్గించడంలో, పూర్తిగా నివారించడంలో ప్రజలం భాగస్వామ్యం ముఖ్యమని జిల్లా వైద్యాధికారి రఘునాథస్వామి అన్నారు. జాతీయ గాలి కాలుష్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం వినాయక్‌నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో నిర్వహించిన ర్యాలీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ స్థిరమైన జీవనశైలిని అవలంబించాలన్నారు. కార్యక్రమంలో మల్లీశ్వరి, శోభారాణి, సత్యవతి, శ్రీదేవి, గీతాప్రసాద్, సరస్వతి పాల్గొన్నారు.

చదువుతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

విజయోత్సవాల్లో అధికారులు తప్పక పాల్గొనాలి

» 2కే రన్‌లో కలెక్టర్ ప్రతీక్ జైన్



2కే రన్‌లో కలెక్టర్ ప్రతీక్‌జైన్, అధికారులు, విద్యార్థులు

వికారాబాద్, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి) : ఉన్నత చదువులతో పాటు ఆరోగ్యం కూడా చాలా ముఖ్యమని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. మంగళవారం ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని ఎన్నెపల్లి చౌరస్తా నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు కలెక్టర్, ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, సుధీర్, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులతో కలిసి 2కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విజయోత్సవాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలన్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే ఆరోగ్య సూత్రాలను పాటిస్తూ వ్యాయామం చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరమేశ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, డీఆర్‌డీఏ శ్రీనివాస్, డీవైఎస్‌వో హన్మంత్‌రావు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్ రెడ్డి, బీసీ మైనార్టీ, ఎస్టీ హాస్టల్స్ విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ కళాశాల నిర్వహణకు ఏర్పాట్లు

కొడంగల్: కొడంగల్‌కు మంజూరు చేసిన నర్సింగ్ కళాశాల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. మంగళవారం కొడంగల్‌లో సమీకృత బాలికల వసతి గృహ సముదాయంలో తాత్కాలికంగా నిర్వహించే నర్సింగ్ కళాశాల భవనాన్ని పరిశీలించారు. సదుపాయాలతో పాటు కావాల్సిన మరమ్మతులు చేపట్టాలని సూచించారు. అనంతరం హరే రామ హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అల్పాహారం సిద్ధం చేసి అందించే వంటశాలను సందర్శించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీవో ఉషశ్రీ, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ లిల్లీ మేరీ, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్, డీఈ రాకేశ్ పాల్గొన్నారు.

ఆస్పత్రి నిర్మాణ పనుల్లో నాణ్యత ఉండాలి

ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చేపడుతున్న పనుల్లో నాణ్యతగా ఉండాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. త్వరలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రారంభం చేయనున్న క్రమంలో మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వలో జనరల్ వార్డులు, ఆపరేషన్ థియేటర్, ఐసీయూ గదులను పరిశీలించారు. అనంతరం అనంతగిరి గుట్టలో నిర్మించిన సమీకృత ఆయుష్ వైద్య శాలను పరిశీలించారు. వైద్యశాల ఆవరణలో సీసీ రోడ్డు నిర్మాణానికి అంచనాలను సమర్పించాలని టీఎస్ఎంఐడీసీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లక్ష్మీనారాయణను ఆదేశించారు. ఆయన వెంట సూపరింటెండెంట్ రామ్ చందర్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున్, డీఎంహెచ్‌వో వెంకటరమణలు పాల్గొన్నారు.



శిథిలావస్థలో ప్రభుత్వ కార్యాలయాలు

రికార్డులకు కరువైన భద్రత
ఇబ్బందుల్లో ప్రజలు, కార్యాలయాల సిబ్బంది
7



సంక్షేమంలో దూసుకెళ్తున్న ప్రభుత్వం

ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి
అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన
7

వాటర్ ప్లాంట్ల మూత

మరమ్మతులకు నోచుకోని వైనం
హస్నాబాద్‌లో తాగునీటికి తప్పని తిప్పలు
8



పోలీసులతో వాగ్వాదానికి దిగిన మహిళలు

పొలాల నడుమ డంప్‌యార్డు వద్దు

» రంగాపూర్ గ్రామస్తుల నిరసన.. ఉద్రిక్తత
» శంకుస్థాపనకు ఒప్పించిన అధికారులు



అరెస్ట్ చేస్తున్న పోలీసులు

పరిగి,డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రంగాపూర్ గ్రామ శివారులో డంపింగ్ యార్డు స్థల వివాదం ఉద్రిక్తతకు దారి తీసింది. పరిగి మున్సిపాలిటికి సంబంధించి డంపింగ్‌యార్డుకోసం స్థలాన్ని గతంలోనే రెవెన్యూ అధికారులు రంగాపూర్ శివారులో చూపించారు. అప్పట్లో గ్రామస్తులు అభ్యంతరం తెలిపిన కారణంగా నిలిపివేశారు. తిరిగి మంగళవారం డంపింగ్‌యార్డు శంకుస్థాపన కోసం ఏర్పాటు చేశారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులంతా అక్కడికి చేరుకుని ఇక్కడ మా పొలాల మధ్య డంప్ యార్డు వద్దని నిరసన వ్యక్తం చేశారు. ఇక్కడి నుంచి వేరేచోటకు తరలించాలని డిమాండ్ చేశారు. అక్కడున్న పోలీసులు గ్రామస్తుల నిరసనను అడ్డుకునే ప్రయత్నం చేశారు.ఈ నేపథ్యంలో గ్రామస్తులు, పోలీసుల మధ్య వాగ్వాదంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. గ్రామస్తులను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. పోలీస్ అధికారులు, రెవెన్యూ అధికారులు అక్కడికి చేరుకుని గ్రామస్తులను సముదాయించారు. ప్రభుత్వ అవసరాల కోసం ఇస్తున్నామని, దీని వల్ల ఏమి ఇబ్బంది ఉండదని నచ్చజెప్పారు. దీంతో రంగాపూర్ శివారులో డంపింగ్‌యార్డు ఏర్పాటు శంకుస్థాపన చేసేందుకు గ్రామస్తులను ఒప్పించారు.

స్కూల్ బస్సులో మంటలు

» డ్రైవర్ చాకచక్యంతో తప్పిన ప్రమాదం
» సురక్షితంగా ఇంటికి చేరిన విద్యార్థులు

పరిగి,డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్కూల్ బస్సులో మంటలు చేలరేగడం వికారాబాద్ జిల్లా పరిగిలో కలకలం రేపింది. ఈ ఘటన మంగళవారం సాయంత్రం పరిగిలో చోటు చేసుకుంది. భృంగి ఇంటర్నేషన్ స్కూల్‌కు చెందిన బస్సు మంగళవారం సాయంత్రం స్కూల్ వదిలిన తర్వాత విద్యార్థులను వారి ఇళ్లకు చేరవేసే క్రమంలో పరిగి కోర్టు సమీపానికి రాగానే ఇంజన్‌లో మంటలు చేలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్ బస్సును నిలిపివేసి విద్యార్థులందరిని కిందకు దించేసాడు. బస్సులో 50 మంది విద్యార్థులు ఉండగా, ఎవరికి ఎలాంటి ప్రమాదం జరుగలేదు. స్కూల్‌కు చెందిన మరో బస్సును రప్పించి విద్యార్థులకు వారి ఇళ్లకు క్షేమంగా చేరవేశారు. ఇంజన్‌లో షార్ట్‌సర్క్యూట్‌తోనే మంటలు చెలరేగినట్లు భావిస్తున్నారు.



మంటలు చేలరేగిన బస్సు ఇదే



సమరానికి సై!

పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సన్నాహాలు


ఇప్పటికే ఓటరు జాబితాలు సిద్ధం
పోలింగ్ కేంద్రాలపై కసరత్తు ప్రారంభం
బీసీ రిజర్వేషన్లపై ఉత్కంఠ
17న కేంద్రాల తుది జాబితా ప్రకటన
3,250 బ్యాలెట్ బాక్సులు సిద్ధం

ఓటర్ల వివరాలు

పురుషులు	3,32,038
మహిళలు	3,39,885
ఇతర ఓటర్లు	17
మొత్తం ఓటర్లు	6,71,940

వికారాబాద్/తాండూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సంక్రాంతి పండగ తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు సన్నాహాలు కొనసాగుతున్నాయి. పంచాయతీ ఎన్నికలు నిర్వహించిన తర్వాత పరిషత్ ఎన్నికలు, ఆ తర్వాత మున్సిపాలిటీలకు ఎన్నికలు జరగనున్నాయి. జనవరి మూడో వారంలో ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసి ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహించేందుకు కసరత్తు జరుగుతోంది. జిల్లాలో 585 గ్రామ పంచాయతీలు ఉండగా, 4,982 వార్డులు ఉన్నాయి. ఇప్పటికే వార్డుల వారీగా ఓటరు జాబితా సిద్ధం చేశారు. ఇప్పటి వరకు 3,250 బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేశారు. మహారాష్ట్ర నుంచి ఇంతకు ముందు వచ్చిన

మిగతా 8వ పేజీలో...



పంచాయతీ తర్వాత పరిషత్ ఎన్నికలు

పంచాయతీ ఎన్నికలు ముగిసిన తర్వాత ప్రాదేశిక ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. జిల్లాలో 18 మండలాల పరిధిలో 18 జెడ్పీటీసీ, 221 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, గత ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన చౌడాపూర్, దుద్యాల మండలాలను మండల ప్రజా పరిషత్తుగా గుర్తించేలా చర్యలు తీసుకోవాలంటూ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. కొత్తగా ఏర్పాటు కానున్న రెండు కొత్త మండల ప్రజా పరిషత్తులతో జిల్లాలో జెడ్పీటీసీ స్థానాలు 20కి పెరగనుండగా, అదనంగా 3 నుంచి 4 వరకు ఎంపీటీసీ స్థానాలు పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. అభ్యర్థులు తాము ప్రాతినిధ్యం వహించే పార్టీ గుర్తుతో ఎన్నికల బరిలోకి దిగాల్సి ఉంటుంది.

ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ విఫలం

మహేశ్వరం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, దాన్ని కప్పిపుచ్చుకోవడానికి ప్రజా విజయోత్సవాలు జరుపుకోవడం విడ్డూరంగా ఉందని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములుయాదవ్ అన్నారు. మంగళవారం తుక్కుగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఏ ఒక్కటి కూడా సంపూర్ణంగా అమలు చేయకుండా ప్రజలను మభ్యపెట్టడానికే ప్రజా విజయోత్సవాలు జరుపుకుంటున్నారని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలు, 66 అబద్దాలతో రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్న సీఎం మోసాలను పక్కకు పెట్టి హామీల అమలుకు ప్రయత్నం చేయాలన్నారు. ఎమ్మెల్యే సబితారెడ్డి కూడా కాంగ్రెస్‌తో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకొని ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని మండిపడ్డారు. నాయకులు పాపయ్యగౌడ్, అనంతయ్యగౌడ్, కదారి జంగయ్య యాదవ్, సుదర్శన్‌రెడ్డి, యాదయ్యగౌడ్, వెంకటేష్‌గౌడ్, రచ్చలక్ష్మణ్, రాధాధీరజ్ రెడ్డి, తుక్కుగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ హేమలతారాజు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీరాములు యాదవ్

ఆరుబయట విద్యార్థినుల స్నానం

ఉపాధ్యాయులపై సబ్ కలెక్టర్ ఆగ్రహం

దౌల్తాబాద్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలంపేట కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థినులు ఆరుబయట స్నానం చేయడంపై తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్ ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం సబ్‌కలెక్టర్ కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణ అపరిశుభ్రంగా ఉండటంతో ప్రిన్సిపాల్ జ్యోతి, ఎంఈవో వెంకటస్వామిలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు మిషన్ భగీరథ తాగునీటిని అందించాలని ఆదేశించారు. అనంతరం బాలంపేట, దౌల్తాబాద్‌లలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. వడ్లు అమ్మి చాలా రోజులైనా డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమకాలేదని రైతులు సబ్‌కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీంతో అధికారులను ఆయన ప్రశ్నించారు. రైతుల డబ్బు వెంటనే జమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే గోకఫస్లాబాద్‌లో జడ్పీ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం నాణ్యత లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట తహసీల్దార్ గాయత్రి, రాజేందర్‌రెడ్డి, ప్రమోద్ రావు, వీరన్న ఉన్నారు.


విద్యార్థినులు ఆరుబయట స్నానం చేసే చోటును పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్

ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

శంషాబాద్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని ఆటో ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను కోరారు. ఈమేరకు మంగళవారం సాయంత్రం ఆటో ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు ఆయన్ను నగరంలో కలిసి వినతిపత్రం అందజేశారు. తెలంగాణ ఆటో, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు ఎండీ హబీబ్, బీఎంఎస్ రవి, ఎన్టీఏడీయూ పల్లె రవి, భారతీయ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు మజ్దూర్ మహాసంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్, తెలంగాణ ఆటో అండ్ టాక్సీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నందకిషోర్ టీఆర్‌టీ, ఏకేటీయూ సభ్యులు కలసి వినతిపత్రం ఇచ్చారు. సభ్యులు మాట్లాడుతూ 9 నెలల క్రితం ఆటో డ్రైవర్లలో చర్చలు జరిపి.. వారికి ఇచ్చిన హామీలను ప్రభుత్వం మరిచిపోయిందన్నారు. తెలంగాణలో డ్రైవర్లు ఉపాధి లేక కొట్టుమిట్టాడుతున్నారని అన్నారు. ఆటో, రవాణా కార్మికుల సంక్షేమం కోసం బోర్డు ఏర్పాటు చేస్తామని, ఏటా రూ.12వేలు ఇస్తామని హామీ ఇచ్చినా.. ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. గత ప్రభుత్వం ఓలా, ఉబెర్, ర్యాపిడో వంటి సర్వీసులకు అనుమతి ఇచ్చారని, ప్రభుత్వం వాటిని రద్దు చేయాలన్నారు. ఈ మేరకు మంత్రి పొన్నం స్పందించి చర్చలు జరపడం ఆలస్యమైందని, ఆటోలు బంద్ చేయడం సరికాదన్నారు. త్వరలోనే ఆటో, ప్రైవేటు రవాణా సంఘాలతో చర్చలు జరుపుతామని హామీ ఇచ్చినట్లు సభ్యులు తెలిపారు.

కాగా, కొన్ని సంఘాలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈనెల 7న జరుపతలపెట్టిన ఆటో బంద్‌ను ఐకాసా వ్యతిరేకిస్తుందని సభ్యులు తెలిపారు. ఆటో బంద్ అనేది డ్రైవర్లకు సరికాదని, మంత్రి హామీ ఇచ్చిన నేపథ్యంలో తాము బంద్‌ను వ్యతిరేకిస్తున్నామని ఐకాస డ్రైవర్లు బంద్‌లో పాల్గొనరని తెలిపారు.


మంత్రి పొన్నంకు వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

బీఆర్ఎస్ నాయకులవి కుట్ర రాజకీయాలు


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అధికారానికి దూరమయ్యామన్న అక్కసుతో బీఆర్ఎస్ నాయకులు రాష్ట్రంలో కుట్ర రాజకీయాలు సాగిస్తున్నారని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజారంజక పాలనను చూసి జీర్ణించుకోలేని విపక్షాలు విషం కక్కుతున్నాయని అన్నారు. తలకొండపల్లి మండలం ఖానాపూర్‌లో 25 ఎకరాలలో రూ.125 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల త్వరలో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిని ఆరులేన్ల విస్తరణకు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, రహదారుల మరమ్మతులకు రూ.91 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు వివరించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగన్, మార్కెట్ చైర్మన్ గీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు. అలాగే ఆమనగల్లు, కడ్తాల, మాడ్గుల, తలకొండపల్లి మండలాలకు చెందిన పలువురు బాధితులకు మంజూరైన రూ.2.62 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆమనగల్లులో ఎమ్మెల్యే పంపిణీ చేశారు.


చిన్నారులతో హెచ్‌బీఎల్ సీఎస్ఆర్ అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు

అంగన్‌వాడీ పిల్లలకు పౌష్టికాహారం అందజేస్తున్నాం

శామీర్‌పేట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ చిన్నారులు అనారోగ్యంతో బాధపడకుండ ఉండేందుకు తమ హెచ్‌బీఎల్ తరఫున నిత్యం అరటిపండ్లు, పాలు, మిల్లెట్లతో కూడిన పౌష్టికాహారాన్ని అందజేస్తున్నామని కంపెనీ సీఎస్ఆర్ కోఆర్డినేటర్ విజయలక్ష్మి తెలిపారు. మంగళవారం తూంకుంట కమ్యూనిటీ హాల్‌లో హెచ్‌బీఎల్ ఇంజినీరింగ్ కంపెనీ భగీరథ బాలల వికాస కేంద్ర వార్షికోత్సవాన్ని అంగన్‌వాడీ పిల్లలు, టీచర్లతో కలసి నిర్వహించారు. సీఎస్ఆర్ అధికారులు చిన్నారులకు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి బహుమతులు అందజేశారు. కోఆర్డినేటర్ విజయలక్ష్మి మాట్లాడుతూ తమ హెచ్‌బీఎల్ మండలంలోని 17అంగన్‌వాడీ సెంటర్లను దత్తత తీసుకొని రోజూ పౌష్టికాహారాన్ని అందిస్తోందని చెప్పారు. ఏడాదిలో మూడు జతల యూనిఫారాలను, బర్త్ డే కానుకలను, పిల్లలకు అవసరమైన వస్తువులను అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌బీఎల్ జనరల్ మేనేజర్ అనూష్, ప్రొడక్షన్ ఆపరేషన్స్ హెడ్స్ సుధాకర్, ముఖేష్‌గుప్తా, ఫైనాన్స్ హెడ్స్ రామక్రిష్ణ, మంజుల, ఐసీడీఎస్ సీడీపీవో శారద, సూపర్‌వైజర్, టీచర్లు, ఆయాలు, పిల్లల తల్లిదండ్రులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత

యాచారం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అడవుల సంరక్షణకు ప్రతీ వ్యక్తి బాధ్యతగా భావించి చొరవ తీసుకోవాలని, రాబోయే ఎండాకాలంలో అడవులు అగ్నికి ఆహుతి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఇబ్రహీంపట్నం డివిజన్ అటవీశాఖ రేంజర్ శ్రీనివాస్ రెడ్డి కోరారు. అడవుల సంరక్షణపై తీసుకోవాల్సిన చర్యలపై మంగళవారం గున్‌గల్ నర్సరీలో యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం మండలాల ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులకు ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎండాకాలంలో సిగరెట్, బీడీ కాల్చి అడవీ ప్రాంతంలో పారేస్తే అగ్ని ప్రమాదం సంభవించి విలువైన చెట్లు కాలిపోతాయని, అలా కాకుండా ఉండేందుకు ప్రతీ ఒక్కరు చొరవ తీసుకోవాలన్నారు. అధికారులతో పాటు ఉద్యోగులు ఇందుకు ముందుకు రావాలన్నారు. అడవిలో మంటలు లేచినట్లు గమనిస్తే వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారమందించాలని సూచించారు. అడవులను కాపాడుకుంటే ఎంతో విలువైన వన్యప్రాణులను కాపాడుకోవడం చాలా సులువన్నారు. 1980 వరకు అడవిలో తోడేళ్లు ఉండేవని.. నేడు పూర్తిగా కనుమరుగైనట్లు చెప్పారు. దట్టమైన అడవి ఉంటే నేడవి ఉండేవన్నారు. కుందేళ్ల, అ డవిపందుల వేట నిషేదమన్నారు. గున్‌గల్ రిజర్వ్‌ఫారెస్టులో నేటికి జింకలున్నాయని రహదారి వెంట వాహనాల్లో వెళ్లేవారు జింకలను ప్రమాదాలకు గురి చేయకూడదని కోరారు.పంచాయతీ కార్యదర్శులు అడవుల సంరక్షణ కోసం శ్రద్ధ తీసుకోవాలని కోరారు. మొక్కల సంరక్షణ బాధ్యత మనమందరిపై ఉందనే విషయం గమనించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ రేంజర్ స్వప్న, యాచారం ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, అటవీశాఖ సెక్షన్ అధికారి నర్సింహ తదితరులున్నారు.


మాట్లాడుతున్న రేంజర్ శ్రీనివాస్‌రెడ్డి

వేధించాడని ఫిర్యాదు చేస్తే కళాశాల నుంచి సస్పెండ్

భారత్ బైబిల్ కళాశాల అనాథ విద్యార్థి బ్లెస్సీ ఆవేదన

మేడ్చల్ టౌన్, నవంబరు3(ఆంధ్రజ్యోతి): భారత్ బైబిల్ కళాశాల రిజిస్ట్రార్ డైరెక్టర్లు మానసికంగా, శారీరకంగా వేధించారంటూ భారత్ బైబిల్ కళాశాలకు చెందిన ఓ విద్యార్థిని ఆవేదన వ్యక్తం చేసింది. వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే కాలేజీ యాజమాన్యం తనను కళాశాల నుంచి తొలగించి కేసు పెట్టారంటూ మొరపెట్టుకుంది. తనకు జరిగిన అన్యాయం పట్ల బాధిత విద్యార్థిని మంగళవారం డబిల్‌పూర్ గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. విజయవాడకు చెందిన బ్లెస్సీ సందక(20) మేడ్చల్ మండలం డబిల్‌పూర్ శివార్లలోని భారత్ బైబిల్ కళాశాలలో బ్యాచ్‌లర్ ఆఫ్ థియాలజీ చదువుతోంది. కొద్ది రోజులుగా రిజిస్ట్రార్ వినయ్ కుమార్ ఆమెను మానసికంగా, శారీరకంగా వేధించసాగాడు. అతడి వేధింపులపై విద్యార్థిని కళాశాల డైరెక్టర్ భోజిరెడ్డికి ఫిర్యాదు చేసినప్పటికీ వారు పట్టించుకోలేదు. అనంతరం రిజిస్ట్రార్, డైరెక్టర్ ఇద్దరూ కలిసి విద్యార్థినిని వేధించారు. దీంతో ఆమె నవంబరు 1న మేడ్చల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు. కాగా కేసు ఉపసంహరించుకోవాలని రిజిస్ట్రార్, డైరెక్టర్లు వొత్తిడి తేగా బాధితురాలు ఒప్పుకోలేదు. దీంతో విద్యార్థులకు, కళాశాలకు ఇబ్బంది కలిగే విధంగా ప్రవర్తించిందంటూ మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో బ్లెస్సీ, ఆమెతో పాటు అక్షయ్ అనే యువకుడిపై కాలేజీ నిర్వాహకులు ఫిర్యాదు చేయగా వారిపై కేసు నమోదు చేశారు. విషయాన్ని బయట పొక్కకుండా యాజమాన్యం తనపై వొత్తిడి తీసుకొచ్చినప్పటికీ తాను వినకపోవటంతో మరిన్ని చిత్రహింసలు పెడుతున్నారని విద్యార్థిని ఆవేదన వ్యక్తం చేసింది. ఇంకా మూడు నెలల్లో తన ఫైనల్ ఇయర్ పూర్తి కానున్నదని, ఇలాంటి పరిస్థితుల్లో తనను కళాశాల నుంచి సస్పెండ్ చేయటం అన్యాయం అని బాధితురాలు వాపోయింది. రిజిస్ట్రార్, డైరెక్టర్ల వేధింపుల తాళ లేక ప్రతిఘటించిన పాపాన తన జీవితాన్ని నాశనం చేశారంటూ ఆవేదన వ్యక్తం చేసింది.


భారత్ బైబిల్ కళాశాల బాధితురాలు బ్లెస్సీ సందక

విచారణ జరుపుతున్నాం : సీఐ సత్యనారాయణ

భారత్ బైబిల్ కళాశాల విద్యార్థిని బ్లెస్సీ ఇచ్చిన ఫిర్యాదుపై నవంబరు 1న కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని సీఐ సత్యనారాయణ తెలిపారు. బ్లెస్సీ, అక్షయ్ అనే యువకుడితో కలిసి కాలేజీలో తరగతులు నిర్వహించకుండా అడ్డుకోవటంతో యాజమాన్యం ఆమెపై ఫిర్యాదు చేయగా ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ కేసు విచారణ జరిపేందుకు ప్రత్యేకంగా మహిళా ఎస్సైని నియమించినట్టు చెప్పారు. యాజమాన్యంతో పాటు, విద్యార్థుల వాంగ్మూలాలను సేకరిస్తున్నామని సీఐ సత్యనారాయణ వివరించారు.

ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డుకు సన్మానం



హోంగార్డును సన్మానిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, డిసెంబర్ 3(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డులకు తాము ఎల్లప్పుడు అందుబాటులో ఉంటామని, ఏదైనా అవసరం ఏర్పడితే సంప్రదించాలని జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం ఎస్పీ కార్యాలయంలో ఉద్యోగ విమరణ పొందిన హోంగార్డు సత్తయ్యను సన్మానించారు. ఎస్పీ మాట్లాడుతూ.. హోంగార్డు అధికారులు పోలీస్‌శాఖకు అందించే సేవలు విలువైనవని, వారి సేవలను ఎప్పటికీ మరువలేమన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ డేవిడ్, జిల్లా హోంగార్డ్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సుధాకర్, రాష్ట్ర హోంగార్డు ఆర్గనైజేషన్ సెక్రటరీ చాంద్ పాషా, హోంగార్డులు పాల్గొన్నారు.

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు జాతీయ హోదా కల్పించాలి



మాట్లాడుతున్న భీమ్‌రెడ్డి

కులకచర్ల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి కేంద్రం జాతీయ హోదా కల్పించాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కులకచర్లలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీఎస్.ఆంజనేయులు మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తి కావడం లేదన్నారు. జాతీయ హోదా కల్పించి పూర్తిచేయాలన్నారు. మహబూబ్‌నగర్, చేవెళ్ల ఎంపీలు డీకే.అరుణ, విశ్వేశ్వర్‌రెడ్డిలు నిధులు మంజూరు చేయించాలన్నారు. రైతు రుణమాఫీ ఘనత కాంగ్రెస్‌దే అన్నారు. త్వరలోనే పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందన్నారు. సమావేశంలో నాయకులు వెంకటయ్య, రాంచంద్రయ్య పాల్గొన్నారు.

సన్న రకం ధాన్యానికి రూ.500 బోనస్



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న పరిగి ఏడీఏ లక్ష్మీకుమారి

కులకచర్ల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తోందని పరిగి ఏడీఏ లక్ష్మీకుమారి తెలిపారు. మంగళవారం చౌడాపూర్ మండలం మెడినడంలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం చౌడాపూర్‌లో ఎరువుల దుకాణాలను పరిశీలించారు. ఆమె వెంట ఏవో పరిమళ, ఏఈవో విశ్వనాథ్ ఉన్నారు.

గ్రామాల నుంచే ప్లాస్టిక్ నిషేధం కొనసాగాలి



కులకచర్ల వివేకానంద కళాశాలలో మాట్లాడుతున్న ప్రహ్లాద్‌రావు

కులకచర్ల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల నుంచే ప్లాస్టిక్ నిషేధం కొనసాగాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాద్‌రావు అన్నారు. మంగళవారం వివేకానంద జూనియర్ కళాశాల, కరణం పద్మావతి డిగ్రీ కళాశాల విద్యార్థులకు వీఎస్ ఎంటర్ ప్రైజెస్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకంతో ఎన్నో అనర్థాలు కలుగుతున్నాయన్నారు. ప్లాస్టిక్ నిషేధంపై విద్యార్థి దశ నుంచే ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అంజిలయ్య, కళాశాల సిబ్బంది విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంటర్ ప్రైజెస్ నిర్వాహకులు సాయిభరత్‌కుమార్, ఉత్తమ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజీవ్ రహదారి విస్తరణను 120ఫీట్లకు తగ్గించాలి



మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న నిర్వాసితులు

శామీర్‌పేట, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టనున్న రాజీవ్‌రహదారి విస్తరణను 200ఫీట్లకు కాకుండా 80ఫీట్లకు తగ్గించి 120ఫీట్ల మేర మాత్రమే స్థలాలను సేకరించాలని రోడ్డు విస్తరణలో ఇళ్లు, షాపుల కోల్పోనున్న నిర్వాసితులు భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శంకర్‌కుమార్‌కు మొరపెట్టుకున్నారు. రాజీవ్‌రహదారి నిర్వాసితులు మంగళవారం తూంకుంటలో జిల్లా బీజేపీ నాయకుడు, తూంకుంట మెయిన్ రోడ్డు బిల్డింగ్స్ ఓనర్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు కాసుల సుభాష్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్ల కార్డులతో రాజీవ్‌రహదారిపై ర్యాలీగా తిరిగి ఆందోళన చేశారు. తూంకుంటలో షాపులను మూసి ఆందోళన చేస్తున్న బాధితుల వద్దకు జిల్లా భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శంకర్‌కుమార్ వచ్చి మాట్లాడారు. తూంకుంట వద్ద హైవే విస్తరణలో మీ సమస్యలేమిటని నిర్వాసితులతో మాట్లాడి అభ్యంతరాలను స్వీకరించారు. కార్యక్రమంలో తూంకుంట వెల్ఫేర్ సొసైటీ నాయకులు రాజులుగౌడ్, విద్యాసాగర్, సోనామ్, మల్లేశ్‌గౌడ్, విక్రమ్‌గౌడ్, ఆంజనేయులు, నాగేందర్, మధు, శ్రీనివాస్‌గౌడ్, బాధితులు పాల్గొన్నారు.

అక్షరాభ్యాస్‌తో చిన్నారులకు ఎంతో ఉపయోగం

న్యూయార్క్ డీసీ దిలీప్‌కుమార్ చౌహాన్



ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) :నల్లమల్లారెడ్డి రూపొందించిన అక్షరాభ్యాస్ పలకలు చిన్నారులకు ఎంతో ఉపయోగం పడుతాయని న్యూయార్క్ డీసీ దిలీప్ కుమార్ చౌహాన్ తెలిపారు. న్యూయార్క్‌లోని డీసీ (డిప్యూటీ కమిషనర్) కార్యాలయంలో ఆయన నల్లమల్లారెడ్డి రూపొందించిన అక్షరాభ్యాస్ పలకలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్షరభ్యాస్ పలకలు చిన్నారులకు ఎంతగానో ఉపయోగపడుతుందని, చిన్నారుల చదువులకు పునాది వస్తుందని తెలిపారు. న్యూయార్క్‌కు వచ్చే విద్యార్థు లకు అన్ని మౌళికసదుపాయాలతో పాటు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్ల మల్లారెడ్డి విద్యాసంస్థల ఛైర్మన్ నల్ల మల్లారెడ్డి, డైరెక్టర్లు, ప్రిన్సిపాళ్లు తదితరులు పాల్గొన్నారు.



శిథిలావస్థలో పాత టెలికాం ఆఫీసు

శిథిలావస్థలో ప్రభుత్వ కార్యాలయాలు

- రికార్డులకు భద్రత కరువు
- ఇబ్బందుల్లో ప్రజలు, కార్యాలయాల సిబ్బంది

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మారుతున్నాయి. అధికారులు మారుతున్నారు. కానీ సర్కారు కార్యాలయాల దయనీయ దుస్థితి మాత్రం మారడం లేదు. నిజాం జమానాలో తాలూకా తహసీల్దార్ల కోసం నిర్మించిన పాత భవనాలు నేటికీ సేవలందిస్తున్నాయి. మేడ్చల్ తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలోని భవనాలు శిథిలావస్థకు చేరింది. ప్రస్తుతం గత్యంతరం లేని పరిస్థితుల్లో తహసీల్దార్, ఆర్‌ఐ, వీఆర్వో, సర్వేయర్ తమ విధులు నిర్వహిస్తున్నారు. పూర్వం ఈ ప్రాంగణంలో తాలూకా కార్యాలయాల ఏర్పాటుకు అవసరపడేలా భవనాలు నిర్మించారు. తపాల, టెలికాం, ఆబ్కారీ, సాంఘిక సంక్షేమ, పశుసంవర్ధక కార్యాలయాలు ప్రస్తుత తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని భవనాల్లో ఉండేవి. కాగా వీటిలో కొన్ని భవనాలు శిథిలావస్థకు చేరడంతో తహసీల్దార్, ఆర్‌ఐ, వీఆర్‌ఓల కార్యాలయాలు మినహా మిగితా కార్యాలయాలను వేరే చోటుకు తరలించారు.



శిథిలావస్థలో మేడ్చల్ తహసీల్దార్ కార్యాలయం

దశాబ్దాలుగా అదే పురాతన కార్యాలయం

కీలక రెవెన్యూ కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ భూముల రికార్డులకు భద్రత కరువైందని వాపోతున్నారు. వివిధ పనుల నిమిత్తం రెవెన్యూ కార్యాలయానికి వచ్చే మండల ప్రజలు కార్యాలయ దుస్థితి చూసి ఆశ్చర్యపోతున్నారు. ఎన్ని సంవత్సరాలైనా కార్యాలయ దుస్థితి మారకపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో తహసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి నిధులు విడుదలైనా అధికారుల నిర్లక్ష్యంతో అది అటకెక్కింది. అధికారులు కార్యాలయంను అద్దె భవనంలోకి మార్చి ఇదే స్థలంలో నూతన కార్యాలయంను నిర్మించేందుకు సన్నాహాలు చేశారు. అద్దె భవనం కోసం కూడా వెతికారు. కానీ చివరకు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో ఇదే అదనుగా కొందరు రెవెన్యూపై పట్టు ఉన్న ప్రైవేట్ వ్యక్తులు తాత్కాలిక సిబ్బంది సహకారంతో రికార్డులను కూడా తారుమారు చేసే ఆస్కారం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమౌతున్నాయి. అధికారులు శిథిలావస్థకు చేరిన కార్యాలయాల్లో వసతుల్లేక విధులు నిర్వహించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అయినా ఉన్నతాధికారులు వాటి గురించి పట్టించుకోవడం లేదు. ప్రస్తుత తహసీల్దార్, ఆర్‌ఐ, వీఆర్‌వో, సర్వేయర్ కార్యాలయాలకు రక్షణ లేని పరిస్థితి నెలకొంది. గత వర్షాకాలంలో తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు తడిసి ముద్దయ్యాయి. గతంలో కార్యాలయంలో ఉన్న టీవీని సైతం ఎత్తుకపోయేందుకు యత్నించారు. ఈ పాడుబడ్డ భవనాలను అధికారులు వదలడం లేదు. వాటి స్థానంలో కొత్త భవనాలను నిర్మించటం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పట్టించుకొని శిథిలావస్థకు చేరిన తహసీల్దార్ ఆఫీసు ఆవరణలో నూతన భవనాన్ని నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

సంక్షేమ కార్యక్రమాల్లో దూసుకుపోతున్న ప్రభుత్వం

మేడ్చల్ టౌన్/ఘట్‌కేసర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రజావసరాల మేరకు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దూసుకు పోతున్నదని మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మేడ్చల్‌లోని తుమ్మ చెరువు-వివేకానంద చౌరస్తా వరకు నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు, ఐదో వార్డులో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నిర్మాణ పనులకు ఎమ్మెల్యే మల్లారెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను ప్రభుత్వ నెరవేర్చిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రం పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేస్తోందన్నారు. రానున్న కాలంలో మరిన్ని ప్రాజెక్టులు తెస్తామన్నారు. మేడ్చల్ అభివృద్ధికి దృష్టి సారించామన్నారు. నియోజకవర్గం పెద్దగా ఉన్నందున ఈ ప్రాంతం అభివృద్ధికి భారీగా నిధులవసరం అన్నారు. ప్రజాప్రతినిధులు తన దృష్టికి తెచ్చిన సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మేడ్చల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ మర్రి దీపిక, వైస్ ఛైర్మన్ రమేష్, కౌన్సిలర్లు దేవరాజ్, శివకుమార్, శ్రీనివాస్‌రెడ్డి, గణేష్, నాయకులు ఎం.నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో జరిగిన పలు కార్యక్రమాల్లో చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయం వద్ద ఛైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. సర్కారు గ్యారెంటీల అమలుకు చర్యలు తీసుకుంటోందన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, రైతులకు రుణమాఫీ వంటి పథకాలను అమలు చేశామన్నారు. సంక్షేమ పథకాలు అందని అర్హులెవరైనా ఉంటే మున్సిపల్ కార్యాలయాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. డ్వాక్రా మహిళలకు విరివిగా రుణాలందిస్తున్నట్లు చెప్పారు. మున్సిపల్ కార్మికులకు పీపీఈ కిట్లు అందజేశారు. సిబ్బందికి నిర్వహించిన వైద్య శిబిరంలో వివరాలడిగి తెలుసుకున్నారు. వారికి భోజనం వడ్డించారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు వజ్రేష్‌యాదవ్, మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



మేడ్చల్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్లారెడ్డి


ఆలూరు ఘటనలో మృతదేహాలకు అంత్యక్రియలు

మృతుల కుటుంబాలను పరామర్శించిన నాయకులు



ఆలూరులో కృష్ణ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

చేవెళ్ల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆలూర్ గ్రామం గేట్ వద్ద కూరగాయలు అమ్ముతున్న రైతులపైకి లారీ దూసుకెళ్లడంతో నలుగురు మృతి చెందగా మరో నలుగురు గాయలపాలైన విషయం తెలిసిందే. ఈమేరకు మంగళవారం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో నాలుగు మృతదేహాలకు వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. కూరగాయలు కొనుగోలు చేసేందుకు వచ్చి మృతిచెందిన జామీల్ మృతదేహాన్ని పోలీస్‌లు అతడి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అనంతరం మిగతా వారి కుటుంబ సభ్యులకు మృతదేహాలను అప్పగించారు. ఆలూర్, నాన్‌చెరి గ్రామాల్లో మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు. దాంతో ఆ రెండు గ్రామాల్లో బంధువులు, కుటుంబ సభ్యుల రోదన అందరినీ కంటతడి పెట్టించాయి. రెండు గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామస్తులందరూ పనులకు వెళ్లకుండా ఊళ్లోనే ఉండిపోయారు. మృతుల కుటుంబ సభ్యులను చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, పలువురు బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పరామర్శించారు. అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా రెండు గ్రామాలతో పాటు బస్‌స్టేజీల వద్ద పోలీస్‌లు బందోబస్తు నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలను నివారించి మృతుల కుటుంబకు పరిహారం అందించాలని కోరుతూ సోషలిస్టు పార్టీ నాయకులు నీరటి ఆంజనేయులు, సుప్పల నర్సింలు, జంగయ్యల ఆధ్వర్యంలో చేవెళ్ల ఆర్డీవో చంద్రకళకు వినతిపత్రం అందించారు. కాగా, ప్రమాదం జరిగిన స్థలంలో ఎవ్వరూ కూరగాయలు అమ్మవద్దని చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ప్రమాద స్థలం జనం లేకుండా వెలవెలబోయింది. ఆలూరు గేట్ నుంచి చేవెళ్ల వరకు ఎక్కడ చూసిన పోలీస్‌ల పహారా కన్పించింది.



కూరగాయలు అమ్మవద్దని ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన ఏఎంసీ అధికారులు

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

రోడ్డు ప్రమాదంలో గాయలపాలైన మహిళా రైతులు బాలమణికి కాలు విరిగింది. మరో మహిళా రైతు ఆకుల పద్మకు తలకు గాయమైంది. మరో వ్యక్తి మల్యాద్రి చెయ్యి విరిగింది. వీరంతా ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. లారీ డ్రైవర్ అమీర్ నగరంలోని ఉస్మానియాలో చికిత్స పొందుతున్నాడు. అతడి రెండు కాళ్లు విరిగాయి. వీరందరి పరిస్థితి నిలకగానే ఉందని పోలీస్‌లు తెలిపారు.

చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌కు లారీ తరలింపు

ఆలూరు గేట్ వద్ద రోడ్డు ప్రమాదానికి కారణమైన లారీ నగరంలోని చంద్రాయణగుట్టకు చెందినదిగా గుర్తించారు. అయితే, ప్రమాద స్థలం వద్ద లారీ ఉంటే కోపంతో ఎవరైనా దానికి నిప్పు పెట్టే ప్రమాదం ఉందని చేవెళ్ల పోలీస్‌లు రాత్రికి రాత్రే ప్రత్యేకంగా రెండు క్రేన్‌ల సాయంతో శంకర్‌పల్లి నుంచి తెప్పించి మంగళవారం తెల్లవారుజాము వరకు చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. మంగళవారం ఉదయం చూసిన వారందరూ అక్కడ ప్రమాదానికి కారణమైన లారీ ఏమైందని చర్చించుకోవడం కన్పించింది.



సిబ్బందికి సూచనలు ఇస్తున్న అడిషనల్ డీసీపీ రామ్‌కుమార్

విధినిర్వహణలో అలసత్వం తగదు

ఆమనగల్లు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): విధినిర్వహణలో అలసత్వం తగదని శంషాబాద్ అడిషనల్ డీసీపీ రామ్‌కుమార్ అన్నారు. ఆమనగల్లు పోలీసుస్టేషన్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. రికార్డులు, పరిసరాలను పరిశీలించారు. సీఐ ప్రమోద్ కుమార్, ఎస్ఐ వెంకటేశ్‌లతో సమావేశమై పెండింగ్ కేసుల వివరాల గూర్చి అడిగి తెలుసుకున్నారు. రోడ్డు ప్రమాదాలు, చోరీల నియంత్రణకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. సీసీ కెమెరాలను అన్ని చోట్ల ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. ఏఎస్ఐ బాల్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డీఈఈ కోర్సులో అడ్మిషన్లకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్



రామాచారి, డైట్ కళాశాల ప్రిన్సిపాల్

వికారాబాద్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీల్లో డీఈఈ సెట్ 2024-26 రెండేళ్ల కోర్సులో అడ్మిషన్లకు రెండో విడత సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఈ నెల 5న చేపడుతామని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ కె.రామాచారి మంగళవారం తెలిపారు. 7 నుంచి 9వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలన్నారు. 13న సీట్లు కేటాయిస్తారని, 13 నుంచి 17 వరకు ఫీజు చెల్లించి అలాట్మెంట్ లెటర్‌తో ఆయా కాలేజీలో సర్టిఫికెట్లు చూపి అడ్మిషన్ పొందాలని తెలిపారు. అలాగే కాలేజీ బదిలీ(మైగ్రేషన్) కొరకు 7 నుంచి 9వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

'జూట్ బ్యాగ్స్' శిక్షణను వినియోగించుకోవాలి

శంషాబాద్ రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్వర్ణ భారత్ ట్రస్టు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జీఎమ్మార్ వరలక్ష్మీ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించే జూట్ బ్యాగ్స్ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ట్రస్టు ప్రతినిధులు మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. స్వర్ణభారత్ ట్రస్టులో ఉచిత శిక్షణ ఈ నెల 6 నుంచి ప్రారంభమవుతుందని, కాల పరిమితి 13రోజులు, సమయం ఉదయం 9:30 నుంచి సాయంత్రం 5:30గంటలు ఉంటుందని, వయస్సు 19-45 సంవత్సరాల మధ్య ఉండాలని తెలిపారు. భోజనం, వసతి సదుపాయం కల్పించడం జరుగుతుందన్నారు. రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాలకు చెందిన అభ్యర్థులు అర్హులన్నారు. రేషన్‌కార్డు తప్పనిసరి అని, ఆధార్‌కార్డు, 3ఫోటోలు అందించాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 9391487797, 9177141712, 9618534720, 6301890681, 9441728468 నెంబర్లను సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించాలి




చెంగోల్ జడ్పీ పాఠశాలలో విద్యార్థిలను చదివిస్తున్న డీఈవో రేణుకాదేవి

తాండూరు రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్య, నాణ్యమైన భోజనాన్ని అందించాలని వికారాబాద్ డీఈవో రేణుకాదేవి ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. మంగళవారం చెంగోల్ లోని జిల్లా పరిషత్ పాఠశాలను తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం 4నుంచి 5గంటల వరకు కొనసాగుతున్న స్పెషల్ క్లాసులను పరిశీలించారు. ఎస్ వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషిచేయాలని కోరారు. మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండేలా హెచ్‌ఎం, టీచర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వంట చేసే ముందు బియ్యం, కూరగాయలను జాగ్రత్తగా పరిశీలించాలన్నారు.

డైట్ విద్యార్థులకు అవగాహన

నేడు(బుధవారం) తాండూరు మండలంలోని 33పాఠశాలల్లో నిర్వహించే నాస్ ఎగ్జామ్(నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే.. సామర్థ్య పరిశీలన పరీక్ష)పై డైట్ విద్యార్థులకు డీఈవో అవగాహన కల్పించారు. సిరిగిరిపేట్ పరిధి అల్మాస్‌పేట్ ఇంటర్ నేషనల్ స్కూల్‌లో డైట్ విద్యార్థులకు సర్వేపై పలు సూచనలు చేశారు. 3,6,9వ తరగతులకు ఆలిండియా నేషనల్ అచీవ్‌మెంట్ కార్యక్రమంపై జాతీయ సామర్థ్య పరిశీలన పరీక్ష నిర్వహిస్తున్నందును విద్యార్థులు పరీక్షల్లో ఎలా రాణించాలన్న దానిపై వివరించారు.

రాజీమార్గమే రాజమార్గం



మాట్లాడుతున్న న్యాయాధికారి కాటం స్వరూప

ఆమనగల్లు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాజీ మార్గమే రాజమార్గమని ఆమనగల్లు జూనియర్ సివిల్‌కోర్టు న్యాయాధికారి కాటం స్వరూప అన్నారు. పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్ లు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ఆమనగల్లు కోర్టు ఆవరణలో మంగళవారం ఈ నెల 14న జరగనున్న జాతీయ లోక్‌అదాలత్ నేపథ్యంలో పోలీస్ కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ప్రథమశ్రేణి న్యాయాధికారి కాటం స్వరూప అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమనగల్లు, కడ్తాల, మాడ్గుల, తలకొండపల్లి మండలాల పోలీస్, ఎక్సైజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు. పెండింగ్ కేసుల వివరాలు న్యాయాధికారి అడిగి తెలుసుకున్నారు. లోక్ అదాలత్ గురించి కక్షిదారులకు తెలిపి సద్వినియోగం చేసుకునేలాచూడాలని సూచించారు. కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరిగి సమయం డబ్బు వృథా చేసుకోకుండా లోక్ అదాలత్‌ల ద్వారా రాజీ పడి కేసుల నుంచి విముక్తి పొందాలన్నారు. ఏపీపీ కార్తిక్, ఆమనగల్లు సీఐ ప్రమోద్‌కుమార్, కడ్తాల్ సీఐ శివప్రసాద్, ఎస్సైలు వెంకటేష్, శ్రీకాంత్, వరప్రసాద్, ఎక్సైజ్ సీఐ బైద్యనాథ్ చౌహాన్‌లతో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ల మూత



హస్నాబాద్ ఎస్సీ కాలనీలో పనిచేయని ప్లాంట్

● మరమ్మతులకు నోచుకోని వైనం

కొడంగల్ రూరల్, డిసెంబర్ 3(ఆంధ్రజ్యోతి): కొడంగల్ నియోజకవర్గం దుద్యాల్ మండలం హస్నాబాద్‌లో గ్రామస్తులకు 5 రూపాయలకే 20 లీటర్ల శుద్ధ నీటినందించేందుకు ఏర్పాటు చేసిన వాటర్ పాంట్లు మూడు సంవత్సరాల క్రితం మూతబడిపోయాయి. గ్రామంలో 2020, 2021లలో భీమరాయ గుడి సమీపంలో ఒక వాటర్ ప్లాంటు, ఎస్సీ కాలనీలో ప్రాథమిక పాఠశాల ఎదురుగా మరో వాటర్ ప్లాంట్‌ను గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ వాటర్ ప్లాంట్ల ద్వారా కేవలం 5రూపాయలకే ఇరవై లీటర్ల శుద్ధ తాగునీరు అందడంతో గ్రామస్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. ఏర్పాటు చేసిన పాంట్లు సంవత్సరం పాటు పనిచేసి మూతబడ్డాయి. ప్రస్తుతం ఈ రెండు ప్లాంట్లు మూతబడడంతో గ్రామస్తులు ప్యూరిఫైడ్ తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. నల్లా నీటిని తాగడంతో రోగాల బారిన పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే వాటర్ ప్లాంట్లకు మరమ్మతులు చేయించి అందుబాటులోకి తేవాలని తీసుకోవాలని కోరుతున్నారు.



గ్రామంలోని భీమరాయ గుడి సమీపంలో పనిచేయని ప్లాంట్

గురుదోట్లలో వంద కాకులు మృతి

ధారూరు, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): ఆ గ్రామంలో చెట్లపై వాలుతున్న కాకులు అకస్మాత్తుగా కింద పడి కొట్టుకుని మృతిచెందాయి. గ్రామంలో అక్కడక్కడ కాకుల కళేబరాలను చూసిన స్థానికులు కాకులు మృతికి కారణాలను అన్వేషిస్తున్నారు. ధారూరు మండలం గురుదోట్లలో మంగళవారం ఈ సంఘటన చోటుచేసుకుంది. కాకులు ఉన్నట్టుండి చెట్లపై నుంచి పడి మృతిచెందాయి. మరికొన్ని గిలగిలా కొట్టుకుంటూ కొన ప్రాణంతో ఉన్నాయి. మైసమ్మ గుడి, బురుజు, పాత పాఠశాల వేపచెట్టు, రాములు ఇంటి వద్ద, ఇతర ప్రాంతాల్లో దాదాపు 100 కాకులు మృతిచెందాయని గ్రామస్తులు వెంకటయ్య, సాయన్న తెలిపారు. కాకులు రోగంతో చనిపోయాయా? లేక ఏదైనా విషపదార్థం తిని చనిపోతున్నాయా? అనేది తేలలేదు. కుకుల మృతిపై కొందరు గ్రామస్థ వైద్యాధికారికి సమాచారం ఇచ్చారు. వాటిని పోస్టుమార్టం చేస్తేనే మృతికి గల కారణాలు తెలుస్తాయని వైద్యాధికారి తెలిపారు.



గురుదోట్లలో చనిపోయిన కాకులు

వికలాంగుల సమస్యలు పరిష్కరించాలి

కొడంగల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): వికలాంగుల సమస్యలను పరిష్కరించాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాకేశ్, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు పోతురాజు డిమాండ్ చేశారు. మంగళవారం కొడంగల్‌లోని పోలీస్‌స్టేషన్ సమీపంలో వికలాంగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి వికలాంగులకు ఇచ్చి న హామీలను అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో వికలాంగుల అట్రాసిటి చట్టం 2016ను అమలు చేయాలన్నారు. వికలాంగులకు రూ.6వేల ఆసరా పింఛన్‌లను అమలు చేయాలన్నారు. బస్సులో ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తామని అమలు చేయలేదన్నారు. ప్రభుత్వం వికలాంగుల సమస్యలను పరిష్కరించేంత వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు.

దివ్యాంగులను చిన్నచూపు చూడొద్దు

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సమాజంలో దివ్యాంగులను చిన్నచూపు చూడొద్దని ఎపీఎం తౌర్యానాయక్ తెలిపారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం ఎదులాబాద్ నైబర్‌వుడ్ సెంటర్‌లో కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో దివ్యాంగులను ఆదరించాలని కోరారు. ప్రభుత్వం దివ్యాంగుల అభ్యున్నతికి కృషిచేస్తుందన్నారు.

క్రైం కార్నర్

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య

బొంరాస్‌పేట్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య జరిగిన గొడవతో మనస్తాపంతో భార్య ఆత్మహత్య చేసుకున్న సంఘటన బొంరాస్‌పేట్ మండలంలో జరిగింది. మంగళవారం ఎస్సై అబ్దుల్ రవూఫ్ తెలిపిన వివరాల మేరకు... మదన్‌పల్లి తండాకు చెందిన అమినానాయక్ గత నెల 29న రాత్రి వరి ధాన్యాన్ని విక్రయించేందుకు పరిగి మార్కెట్‌కు వెళ్లాడు. అక్కడ అమ్మకానికి ఆలస్యం కావడంతో 30న తెల్లవారుజామున ఇంటికి రావడంతో భార్య లాలిబాయి(37) తన భర్త వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడనే అనుమానంతో గొడవ చేసింది. దీంతో మనస్థాపానికి గురైన లాలిబాయి క్రిమిసంహారక మందు తాగింది. కుటుంబ సభ్యులు ఆమెను తాండూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స కోసం వికారాబాద్‌లోని మిషన్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు హైదరాబాద్ డెక్కన్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందింది. ఈ సంఘటనపై లాలిబాయి తల్లి బన్నీబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. లాలిబాయి అంత్యక్రియలు మంగళవారం మదన్‌పల్లి తండాలో జరిగాయి. లాలిబాయి దంపతులకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు.



లాలిబాయి మృతదేహం

తమ్ముడి ఆచూకీ కోసం మహిళకు వేధింపులు

● మనస్తాపంతో ఉరేసుకొని బలవన్మరణం



సాయమ్మ(ఫైల్)

ధారూరు, నవంబరు3(ఆంధ్రజ్యోతి):బెదిరింపులకు భయపడి మనస్థాపం చెందిన ఓ మహిళ చెట్టుకు ఉరివేసుకుంది. ఈ సంఘటన మండల పరిధిలోని కమ్మర్‌పల్లిలో మంగళవారం జరిగింది. ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపి న వివరాల ప్రకారం.. కుమ్మర్‌పల్లికి చెందిన ఇల్లెపు సాయమ్మ(45) తమ్ముడు ఇల్లెపు ఆనంద్ అదే గ్రామానికి చెందిన వికారాబాద్‌లో ఉంటున్న ఓ అమ్మాయిని తనతో పాటు తీసికెళ్లాడని అమ్మాయి కుటుంబ సభ్యులు వికారాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో కావలి వెంకటయ్య, నాగమణి అవుసుపల్లికి చెందిన ఉలేందర్, పోలీసులు సాయమ్మకు ఫోన్ చేసి 'నీ తమ్ముడు ఆనంద్ ఎక్కడున్నాడు?' అని పదేపదే అడిగి ఇబ్బందులకు గురి చేశారు. సోమవారం సాయంత్రం వెంకటయ్య, నాగమణి, ఉలేందర్ కుమ్మర్‌పల్లికి వచ్చి ఇంటి వద్ద ఉన్న సాయమ్మ తల్లి చంద్రమ్మను బెదిరిస్తూ ఆనంద్ ఆచూకీ అడిగి దూషించారు. ఈ సంఘటనతో మనస్థాపం చెందిన సాయమ్మ మంగళవారం గ్రామంలోని మహిపాల్‌రెడ్డి పొలం సమీపంలో చెట్టుకు ఉరేసుకుంది. ఆమె సోదరుడు అశోక్‌కుమార్ ఫిర్యాదు మేరకు బాధ్యులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఏటీఎంలో చోరీకి యత్నం

తాండూరు రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):ఏటీఎంలో చోరీకి యత్నించిన దొంగలు అలారాం మోగడంతో పారిపోయారు. ఈ సంఘటన కరన్‌కోట్‌లో చోటుచేసుకుంది. ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కరన్‌కోట్‌లో ఎస్‌బీఐ ఏటీఎంలో సోమవారం అర్ధరాత్రి దొంగలుపడ్డారు. ఇద్దరు ముఖానికి గుడ్డచుట్టుకొని ఏటీఎంలోకి ప్రవేశించారు. కరెంటు కనెక్షన్ కట్ చేసి గడ్డపారలతో ఏటీఎంను ధ్వంసం చేసే ప్రయత్నం చేశారు. అప్పటికే అలారం మోగడంతో దొంగలు పారిపోయారు. బ్యాంకు అధికారులకు నోటిఫికేషన్ రావడంతో కరన్‌కోట్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏటీఎంలో డబ్బు చోరీకి గురికాలేదని ఎస్‌ఐ తెలిపారు. చోరీకి సంబంధించిన దృశ్యాలు సీసీ ఫుటేజీలో రికార్డయ్యాయని ఎస్‌ఐ చెప్పారు. చోరీకి యత్నించిన వారి ఆచూకీ తెలిస్తే పోలీసులకు ఇవ్వాలని ఈ సందర్భంగా ఎస్‌ఐ కోరారు.



ఏటీఎంను ధ్వంసం చేసేందుకు యత్నిస్తున్న దొంగ

ఊరూరా ప్రజాపాలన విజయోత్సవాలు



ఘట్‌కేసర్‌లో విజయోత్సవ ర్యాలీలో ప్రజాప్రతినిధులు, నాయకులు



వికారాబాద్‌లో ర్యాలీ

ఘట్‌కేసర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవాలను వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు. ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల్లో నిర్వహించిన విజయోత్సవాల ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు. మున్సిపాలిటీల పరిధిలోని చెత్త ఏసే ప్రాంతాలను శుభ్రం చేసి ముగ్గులు వేశారు. మున్సిపల్ సిబ్బందికి వైద్యశిబిరాలను నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు కలిసి భోజనాలు చేశారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్లు పావనిజంగయ్య యాదవ్, బి.కొండల్‌రెడ్డి, కమిషనర్లు చంద్రశేఖర్, వీరారెడ్డి, వైస్‌చైర్మన్ రెడ్డియానాయక్, మహేష్, ప్రభాకర్‌రెడ్డి, వెంకటేష్, ముత్యాలు యాదవ్, రాధాకృష్ణ, జంగారెడ్డి, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వికారాబాద్: అసెంబ్లీ స్పీకర్ ఆదేశాల మేరకు ప్రజాపాలన విజయోత్సవాలను నిర్వహిస్తున్నామని వికారాబాద్ మునిసిపల్ చైర్ పర్సన్ మంజుల తెలిపారు. మునిసిపల్ శాఖ, చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చౌరస్తా నుంచి కార్యాలయం ర్యాలీ నిర్వహించారు. మునిసిపల్ కార్యాలయంలో సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. పారిశుధ్య కార్మికులను చైర్‌పర్సన్ సన్మానించారు. కార్యక్రమంలో కమిషనర్ జకీర్ అహ్మద్, టీపీవో వేణుగోపాల్, మేనేజర్ కృపాకర్, మెప్మా రవి, మెప్మా వెంకట్, ఏఈ అనిల్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఏసు, అకౌంటెంట్ వాసవి, బిల్ కలెక్టర్లు, ఆర్పీలు, సిబ్బంది రామకృష్ణ, జవాన్లు చిన్నయ్య, శ్రీను, ఆశయ్య, శంకర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బషీరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. వివిధ గ్రామాల్లో ప్రజాపాలన దినోత్సవంలో భాగంగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లలో ఏ ఒక్కరికీ ఇళ్లు ఇచ్చిన పాపాన పోలేదన్నారు. త్వరలోనే పేదలకు ఇళ్లు, పింఛన్లు ఇస్తామన్నారు. ఈ సందర్భంగా జీవన్గిలో ఏఎంసీ చైర్మన్ జి.మాధవరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను గుర్రం రథంపై ఊరేగింపుగా సభ వద్దకు తీసుకెళ్లారు. కార్యక్రమంలో నవాంద్గీ సొసైటీ చైర్మన్ ఎ.వెంకట్‌రాంరెడ్డి, ఏఎంసీ చైర్మన్ మాధవరెడ్డి, మాజీ జడ్పీటీసీలు శ్రీనివాస్‌రెడ్డి, ఎం.రాకేష్, అజయ్‌ప్రసాద్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహులుగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మణ్‌రావు, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రామునాయక్, కె.నరేందర్, విష్ణువర్ధన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, నర్సిరెడ్డి, తలారి సురేష్, కె.నరేందర్ పాల్గొన్నారు.



బషీరాబాద్ గొట్టిగఖుర్దులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

కొడంగల్: కొడంగల్ మున్సిపల్ కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్, కమిషనర్ బలరాంనాయక్,వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, ఎంఈవో రాంరెడ్డి, కౌన్సిలర్లు ర్యాలీలో పాల్గొన్నారు. మెప్మా ఎస్‌హెచ్‌జీ సంఘాలకు చెక్కులు, ఉత్తమ కార్మికులకు సన్మానం, పారిశుధ్య కార్మికులకు వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారులు, పాఠశాలల విద్యార్థులు, మున్సిపల్ అధికారులు, మెప్మా రిసోర్స్ పర్సన్‌లు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

శామీర్‌పేట: ప్రజలకు ఉత్తమ పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని తూంకుంట మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు అన్నారు. మున్సిపల్‌లో చైర్మన్, కమిషనర్ వెంకటగోపాల్‌ల ఆధ్వర్యంలో ప్రజాపాలన విజయోత్సవాలను నిర్వహించారు. తూంకుంటలో విద్యార్థులతో రాజీవ్‌రహదారిపై 2కే రన్‌ను నిర్వహించారు. శామీర్‌పేట, బాబాగూడలో పారిశు ధ్య సిబ్బందిని కమిషనర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రేణుక సన్మానించి బహుమతులు అందజేశారు. తూంకుంటలో మహిళా సిబ్బంది, డ్వాక్రా మహిళలకు రంగోళి పోటీలు నిర్వహించారు. తూంకుంట 8, 9, 15వ వార్డుల్లో సీసీ రోడ్లకు, డ్రైనేజీ నిర్మాణాలకు అధికారులు, ప్రజా ప్రతినిధులు శంకుస్థాపనలు చేశారు.



తూంకుంటలో విద్యార్థులతో 2కే రన్ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్

పరిగి: పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పరిగి మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్ అన్నారు. అర్బన్‌డే సందర్భంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. శానిటేషన్ వర్కర్లకు వైద్య పరీక్షలు నిర్వహించారు. డ్వాక్రా మహిళలకు చెక్కులందజేశారు. బ్యాంక్ రుణాలతో స్వయం ఉపాధి స్కీంలు ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, తహసీల్దార్ ఆనంద్‌రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కొడంగల్‌లో మహిళా సంఘాలకు చెక్కులందిస్తున్న మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి



పరిగిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

రూ.41కోట్లతో పరిగి అభివృద్ధికి చర్యలు

పరిగి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పరిగి పట్టణ అభివృద్ధికి రూ.41కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మునిసిపల్ పరిధిలోని ఆరో వార్డు సుల్తాన్‌నగర్‌లో రూ.22లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు మంగళవారం రాత్రి శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ, పరిగిలో రూ.20కోట్లతో సీసీ, డ్రైనేజీ పనులు, ఐదు కోట్లతో కార్యాలయ భవనాన్ని నిర్మిస్తామన్నారు. రూ.16 కోట్ల శాశ్వత మంచినీటి సమస్య పరిష్కారానికి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పట్టణంలోని నాలుగు వాటర్ ట్యాంకుల నిర్మాణం, కొత్త కానీల్లో పైపులైన్ ఏర్పాటు చేసి, ప్రతింటికి నల్లా కనెక్షన్ ఇచ్చే బాధ్యతను తాను తీసుకుంటానని తెలిపారు. ఏ కాలనీలోనూ నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ బి.జ్ఞానేశ్వర్, ఏఎంసీ చైర్మన్ బి.పరశరాంరెడ్డి, వార్డు కౌన్సిలర్ నాగేశ్వర్‌రావు, నాయకులు ఆనెం ఆంజనేయులు, పి.చిన్ననర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

'ఈ పాపం గత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే'

పూడూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆలూరు గేటు సమీపంలో జరిగిన ప్రమాదానికి కారణం గత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని పరిగి, చేవెళ్ల ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, కాలె యాదయ్య అన్నారు. మంగళవారం మన్నెగూడ సమీపంలోని ఓ ఫాం హౌస్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రమాద ఘటనపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలను తాము ఖండిస్తున్నామని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఈ ప్రాంతానికి రావాల్సిన నిధులు, నీళ్ల, నియామకాలు రానివ్వకుండా అడ్డుకున్నారని విమర్శించారు. గత కాంగ్రెస్ హయాంలో మంజూరైన హైవేను కావాలనే బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ఆపిందన్నారు. హైవే పనుల ప్రారంభానికి నవంబరు 28నే అనుమతొచ్చిందని, పనులు ప్రారంభించామని వెల్లడించారు. బీఆర్ఎస్ పాలనలో వికారాబాద్ జిల్లాను అభివృద్ధిలో దిగజార్చిందన్నారు. ప్రాణహిత-చేవెళ్ల పనులు ప్రారంభించిన కేసీఆర్ ఇక్కడి పనులు ఆపేసి నిధులను కాళేశ్వరానికి మళ్లించారన్నారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేందర్, జ్ఞానేశ్వర్, లాల్‌కృష్ణా, పెంటయ్య, శ్రీనివాస్‌రెడ్డి, షకీల్, అజీమ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు. రంగారెడ్డి కలెక్టర్‌తోఎమ్మెల్యే యాదయ్య ఫోన్‌లో మాట్లాడారు. రోడ్డు బాధితుల వివరాలను, క్షతగాత్రులకందుతున్న చికిత్సపై ఆరా తీశారు.

స్థానిక ఎన్నికలే లక్ష్యం

(5వ పేజీ తరువాయి)

ప్రజాప్రతినిధులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొని ఏడాది కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు గ్రామాల్లోసమావేశాలు నిర్వహించనున్నారు. మండల, గ్రామ స్థాయిలో కార్యక్రమాలను చేపట్టనున్నారు.

ఆరు అబద్ధాల పేరిట చార్జిషీట్లు ప్రభుత్వ వైఫల్యాలే లక్ష్యంగా..

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని వివరిస్తూ ప్రజల్లోకి వెళ్లాలని బీజేపీ యత్నిస్తోంది. రాష్ట్ర కమిటీ సూచన మేరకు అన్ని కార్యక్రమాలను నియోజకవర్గ స్థాయిలో నిర్వహించాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించి నియోజకవర్గ కేంద్రాలలో సభలు, ర్యాలీలు నిర్వహించి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని నిర్ణయించారు. సంస్థాగతంగా పార్టీని బలోపేతంగా చేస్తునే నిరసన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. డిసెంబర్ 1 నుంచి 5 దాకా అసెంబ్లీ నియోజకవ ర్గాలలో ఆరు అబద్ధాల పేరిట ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపేలా కార్యచరణను ప్రకటించారు. నియోజకవర్గాల వారీగా చార్జీషీట్లు విడుదలతో పాటు ఎక్కడికక్కడ బహిరంగ సభలు, ర్యాలీలు నిర్వహించాలని నిర్ణయించారు. యువమోర్చా ఆధ్వర్యంలో నిరుద్యోగ భృతి చెల్లింపునకు సంబంధించి సభల ద్వారా ప్రభుత్వాన్ని నిలదీయాలని నిర్ణయించారు. డిసెంబర్ 3న నియోజకవర్గాలలో బైక్ ర్యాలీలు, 2వేల మందితో బీజేపీ సభలు నిర్వహించాలని నిర్ణయించారు. ప్రత్యేకంగా ఈ కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు నియోజకవర్గానికి ఒక ఇన్‌చార్జిని నియమించారు.

రైతు సమస్యలే ఎజెండాగా..

రైతు సమస్యలే ఎజెండగా, కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్యక్రమాలను చేపట్టి ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే డిసెంబరు 29న బీఆర్ఎస్ దీక్షా దివస్‌ను చేపట్టారు. నియోజకవర్గ స్థాయిలో ఈ కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహించారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలు, స్థానిక సమస్యలను ఎండగడుతూ ఎప్పటికప్పుడు ప్రజల్లోకి వెళ్లాలని అధిష్టానం నిర్ణయించింది. ఇందుకు త్వరలోనే కార్యచరణ ప్రకటించనున్నారు. కాగా, స్థానిక కమిటీలను కూడా నియమించాలని నిర్ణయించారు.

సమరానికి సై!

(5వ పేజీ తరువాయి)

బ్యాలెట్ బాక్సులు 1,250 ఉండగా, కర్ణాటకలోని బీదర్ నుంచి 2 వేల బ్యాలెట్ బాక్సులు వచ్చాయి. పంచాయతీ ఎన్నికలు మూడు విడతల్లో నిర్వహించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

10వ తేదీ వరకు అందనున్న నివేదిక

ఈ ఏడాది ఫిబ్రవరి ఒకటో తేదీన సర్పంచులు, వార్డు సభ్యుల పదవీ కాలం ముగిసింది. పల్లెల్లో 11నెలలుగా ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిళ్లు వస్తున్న విషయం తెలిసిందే. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేసి ఎన్నికలకు వెళ్లాలని భావించిన ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల కోసం డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఉమ్మడి జిల్లాల వారీగా సమావేశాలు నిర్వహిస్తూ విజ్ఞప్తులు స్వీకరిస్తున్న కమిషన్ ఈ నెల 10వ తేదీ వరకు రిజర్వేషన్లపై ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నట్లు తెలుస్తోంది. ఆ నివేదికను అధ్యయనం చేసిన తర్వాత బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. బీసీ రిజర్వేషన్ల పెంపు అనివార్యంగా భావిస్తే మాత్రం.. రిజర్వేషన్లు 50 శాతం మించకూడదన్న సుప్రీంకోర్టు ఆదేశాలకు లోబడి ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది రాజకీయ వర్గాల్లో ఉత్కంఠంగా మారింది.

ప్రారంభమైన కసరత్తు

పంచాయతీ, వార్డుల వారీగా ఓటర్ల జాబితా సిద్ధం చేశారు. కొత్తగా నమోదైన ఓటర్ల వివరాలతో అనుబంధ ఓటరు జాబితా రూపొందించే పనిలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. జిల్లాలో 585 పంచాయతీల్లో 4,982పోలింగ్ కేంద్రాలున్నాయి. ఎన్నికల నిర్వహణ కోసం ప్రతి వార్డులో కనీసం ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. ఒక వార్డులో 650 మంది ఓటర్ల వరకు ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తారు. అదే 650 మంది ఓటర్ల కంటే ఎక్కువ ఉంటే అదనంగా మరో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. ఒకే వార్డులో 1,300 కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉంటే మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. ఈ ప్రక్రియలో భాగంగానే ఈనెల 6న పోలింగ్ కేంద్రాల జాబితాపై జిల్లా ఎన్నికల అధికారి ఆమోదం తీసుకోనున్నారు. 7న పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాలను ఎంపీడీవోలు ప్రచురించనున్నారు. 10వ తేదీన జిల్లా ఎన్నికల అధికారి జిల్లా స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం నిర్వహించనుండగా, 12న మండల స్థాయిలో ఎంపీడీవోలు మండల స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తారు. ఇదిలా ఉంటే, పోలింగ్ కేంద్రాల జాబితాలపై అభ్యంతరాలను 7 నుంచి 12వ తేదీ వరకు స్వీకరించనుండగా, 13న వాటిని పరిష్కరించనున్నారు. 16న పోలింగ్ కేంద్రాల తుది జాబితాను జిల్లా ఎన్నికల అధికారి ఆమోదిస్తే.. 17వ తేదీన ఎంపీడీవోలు పోలింగ్ కేంద్రాల జాబితాలను ప్రచురించనున్నారు.

విద్యార్థి కుటుంబానికి పరిహారం?

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఓ కార్పొరేట్ కాలేజీలో ఇంటర్ చదువుతున్న బానోత్ తనుష్‌నాయక్(16) అనే విద్యార్థి రెండె రోజుల క్రితం హాస్టల్ గదిలో ఉరేసుకున్న విషయం తెలిసిందే. కాలేజీ యజమాన్యం, సిబ్బంది వేధింపుల వల్లే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడని అతడి కుటుంబీకులు, బంధువులు, విద్యార్థి సంఘాల నాయకులు కళాశాల వద్ద ఆందోళనకు దిగారు. ప్రిన్సిపల్‌పై దాడిచేసి ఫర్నిచర్ ధ్వంసం చేశారు. పోచారం ఐటీ కారిడార్ సీఐ రాజువర్మ ఆధ్వర్యంలో పోలీసులు వారిని సముదాయించారు. కాగా మంగళవారం కళాశాల యాజమాన్యం విద్యార్థి తండ్రి జగన్నాథం, ఇతర కుటుంబ సభ్యులతో చర్చలు జరిపి మృతికి పరిహారంగా కొంత డబ్బు ముట్టజెప్పేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిసింది. మంగళవారం తెల్లవారుజామున రెండున్నర గంటల వరకు చర్చలు జరిపినట్లు సమాచారం. కాలేజీ వద్ద మరోసారి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులను భారీ సంఖ్యలో మోహరించారు. పోస్టుమార్టం అనంతరం విద్యార్థి మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్టు పోచారం ఐటీ కారిడార్ పోలీసులు తెలిపారు.

సంక్షిప్తంగా

● **తాండూరు:** ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఏడాదిలో చేపట్టిన అభివృద్ధిపై చర్చించేందుకు ఎక్కడికైనా వస్తానని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం తాండూరులో చేపట్టిన అర్బన్ డే కార్యక్రమానికి హాజరై ర్యాలీ ప్రారంభించి ప్రసంగించారు. తాండూరులో రూ.30కోట్లతో ప్రజలకు మంచి నీటి సమస్యను దూరం చేస్తానన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజి సిస్టమ్ ఏర్పాటుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని వెల్లడించారు. ముఖ్యమంత్రి సహకారంతో రూ.500కోట్లు సాధించానని ఎక్కడైన గర్వంగా చెప్పుకుంటానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, కౌన్సిలర్లు నీరజ బాల్‌రెడ్డి, విజయదేవి, ప్రభాకర్‌గౌడ్, రామకృష్ణ, సోమశేఖర్, రవి రాజు, వెంకట్‌రామ్, మున్సిపల్ మేనేజర్ నరేందర్‌రెడ్డి, టీఎంసీ రాజేందర్ ప్రసాద్, ఆర్పీలు, ఉన్నారు. మున్సిపల్ కార్యాలయంలో కార్మికులకు వైద్య శిబిరం నిర్వహించారు. కాగా తాండూరు ప్రజాపాలన కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే వద్ద కాంగ్రెస్ కౌన్సిలర్ నీరజబాల్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. శానిటేషన్‌పై కమిషనర్ చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. శానిటేషన్ మెరుగుపర్చాలని ఆమె కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.

● **కీసర:** తమ సమస్యలు పరిష్కారించాలని ఆశ వర్కర్లు కీసర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆందోళన చేశారు. ఇరవై ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా తమకు ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని, ప్రభుత్వం నెలకు 18వేల వేతనం చెల్లించాలని వర్కర్లు డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్‌ఐ కల్పించాలన్నారు. తమ డిమాండ్లను నేరవేర్చకుంటే యూనియన్ పిలుపు మేరకు కలెక్టరేట్‌లో ధర్నా చేస్తామని వారు ప్రభుత్వాని హెచ్చరించారు.

● **కీసర:** డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు వెంటనే పట్టాలు పంపిణీ చేయాలని పేదలు కీసర తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఇళ్లు కేటాయించి ఏళ్ల గడుస్తున్నాయని, సంవత్సరాలు గడుస్తున్న చీర్యాల్‌లో మాకు ఇంతవరకు పట్టాలు పంపిణీ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వద్ద కనీస సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నట్లు అసహనం వ్యక్తం చేశారు. విద్యుత్, మంచినీటి, రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని, ప్రభుత్వం సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని లబ్ధిదారులు తహసీల్దార్ అశోక్ తెలియజేశారు.

● **బొంరాస్‌పేట్:** వికలాంగుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. బొంరాస్‌పేట్‌లో ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన హాజరయ్యారు. ప్రజాపాలనలో సీఎం రేవంత్‌రెడ్డి వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఒక్కొక్కటిగా హామీలను అమలు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, దుద్యాల కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శేఖర్, మల్లికార్జున్, జానిమీయా, వికలాంగులు పాల్గొన్నారు.

● **పరిగి:** గురుకులాలను సందర్శనకు వెళితే అడ్డుకోవడం ఏమిటని బీఆర్ఎస్ గురుకులాల బాట జిల్లా ఇన్‌చార్జి జంగయ్య, పరిగి మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్,బిఆర్ఎస్ నాయకులు బి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. మంగళవారం బీఆర్ఎస్ నాయకులు పరిగిలోని బీసి బాలుర, మైనార్టీ, ఎస్సీ, ఎస్సీ గురుకులాలను సందర్శించేందుకు వెళితే పోలీసులు, అధికారులు అడ్డుకున్నారు. అయినా వారు వెళ్లి విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం గురుకులాలను విస్మరించిన కారణగా రాష్ట్రంలో ఏడాదిలో 49 మంది విద్యార్థులు మృతి చెందగా, 15 వందలకుపైగా అస్పత్రుల పాలయ్యారని విమర్శించారు. పోలీసులు, ఉపాధ్యాయులు కలిసి బీఆర్ఎస్ నాయకులను అడ్డుకుంటున్నారని, లాఠీలతో అడ్డుకోలేని, ఉద్యమంతో పుట్టిన పార్టీ బిఆర్ఎస్ గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్యాక్స్ వైస్ చైర్మన్ భాస్కర్, నాయకులు బి.రవికుమార్, తాహేర్‌అలీ,మునీర్, వెంకటేశ్, రవిరెడ్డి, హరి పాల్గొన్నారు.

● **నవాబుపేట:** అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న నిరుపేద ప్రజలకు సీఎంఆర్ఎఫ్ సహాయం అండగా ఉంటుందని ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. నవాబుపేట ఎంపీడీవో కార్యాలయంలో వివిధ గ్రామాల 14మందికి ఆయన చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గీతాసింగ్‌నాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటయ్య, బి-బ్లాక్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మండల వర్కింగ్ ప్రసిడెంట్ సామా వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షులు సంజీవరెడ్డి, శివప్రసాద్, ప్రభాకర్‌రెడ్డి, శ్రీధర్, రామకృష్ణ, నర్సింహారెడ్డి, రఘు, సంగారెడ్డి, మల్లేశ్‌కుమార్, గోపాలకృష్ణ, అనిల్‌కుమార్, రాథోడ్, మహేందర్‌రెడ్డి, ఎజాజ్, ప్రసాద్ పాల్గొన్నారు.

● **బొంరాస్‌పేట్:** విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని దుద్యాల ఎంఈవో విజయరామారావు సూచించారు. చిలుముల్ మైలారంలో భోజనాన్ని పరిశీలించారు. వంట పాత్రలు, బియ్యం, వంట సామగ్రిని పరిశీలించారు. పాఠశాల కోసం మంజూరైన అదనపు గదుల నిర్మాణం కోసం గ్రామశివారులో ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

● **బొంరాస్‌పేట్:** వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుష్ఠు రోగుల సర్వేను పకడ్బందీగా చేపట్టాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో రవీందర్ యాదవ్ వైద్యాధికారులు, సిబ్బందికి సూచించారు. బొంరాస్‌పేట్ పీహెచ్‌సీ ఆవరణలో ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.

● **నవాబుపేట:** జిల్లాలో ఎర్రమట్టి అక్రమ రవాణాపై మల్టిజోన్-2 ఐజీ సత్యనారాయణ దృష్టి సారించారు. నల్గొండ ఏఎస్పీ రాములునాయక్, మిర్యాలగూడ సీఐ నాగరాజును టీంగా ఏర్పాటు చేసి సమగ్ర విచారణతో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.